


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 105 | బుధవారం 16 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## చైనాలో కొత్త చట్టాలు.. పరారీలో హువావే వ్యవస్థాపకుడు రెన్ జెంగ్

- హువావే వ్యవస్థాపకుడు కుటుంబంతో సహా చైనాను వీడారంటూ ప్రచారం
- చైనాలో కొత్త నిష్క్రమణ నియంత్రణ చట్టాలు అమల్లోకి వచ్చిన వేళ వదంతులు
- సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపిస్తున్న ఆరోపణలు, స్క్రీన్‌షాట్లు
- ఈ కథనాల పై స్పందించని హువావే, చైనా ప్రభుత్వం
- ఇవి ధ్రువీకరణ లేని ఊహాగానాలేనంటున్న విశ్లేషకులు




2

## బ్రిక్స్ సదస్సులో బాలీవుడ్ మ్యాజిక్.. పాటలతో దౌత్యం నెరిపిన మలేషియా ప్రధాని

- ఢిల్లీ బ్రిక్స్ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా భారతీయ సంగీతం
- సోషల్ మీడియా పోస్టులకు బాలీవుడ్ పాటలు జోడించిన మలేషియా ప్రధాని
- ప్రధాని మోదీతో భేటీకి షారుఖ్ ఖాన్ సినిమా పాటల ఎంపిక
- రష్యా, ఇరాన్ అధ్యక్షులతో సమావేశాలకు అర్థవంతమైన గీతాలు



2

# అసెంబ్లీలో 22ఏ పై చర్చ.. రెవెన్యూ శాఖ పై సీఎం సమీక్ష

రెవెన్యూ శాఖ పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని MCRHRDలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. 22ఏ పై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22ఏ పై చర్చించాల్సిన అంశాల పై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా 22ఏ జాబితా పై సీఎం రేవంత్‌కు రెవెన్యూ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్ష సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, వివేక్ సమావేశమయ్యారు. - మిగతా2లో



## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు



- ధ్వజస్తంభం పై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు
- కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

2

## 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు.. గృహ నిర్మాణ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్ష



- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. - మిగతా2లో

# తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోంది: కిషన్‌రెడ్డి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రజాకార్ల పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందులు, రక్తపు గుర్తులు కనిపిస్తాయని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవతో విముక్తి కలిగిందని చెప్పుకొచ్చారు. నిజాం మెడలు వంచడంతో 1948 సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ గడ్డకు ముక్తి లభించిందని వెల్లడించారు.

- మిగతా2లో



## నా పీఆర్ఓ, పీఏ పై 15 మంది గూండాలు దాడి చేశారు

- సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు



2

## లోతుకుంట భూముల పై సుప్రీంకోర్టు తీర్పు..

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు

లోతుకుంటలో కొనసాగుతున్న భూ వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సుమారు 40 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ తిరస్కరణకు ప్రధానంగా కాలపరిమితికి - మిగతా2లో



# అసెంబ్లీలో 22ఏ పై చర్చ.. రెవెన్యూ శాఖ పై సీఎం సమీక్ష

ఈ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో 22ఏ, ఎల్ నినోపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి వారు చర్చించారు. నవంబర్19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఆయన సమీక్షించారు. రూ. లక్ష లోపు స్వయం ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలల పై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులాల పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్ రూపొందించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సీఈఎస్ఎస్‌తో సమగ్ర అధ్యయనం చేపట్టాలని తెలిపారు. స్టడీ సర్కిళ్ల పనితీరుపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అధికారులు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు.

# ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..
# పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి



స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

# తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత దమనకాండ నడుస్తోంది: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమోచన వేడుకలు జరపడానికి ఎందుకు భయపడుతున్నాయని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఏంఐఎం మోచేతి నీళ్లు తాగి ఈ రెండు పార్టీలు ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 90వ దశకంలో హైదరాబాద్ ముక్తి దివస్ చేయాలని అనేక పోరాటాలు చేశామని ప్రస్తావించారు. గత ఐదేళ్ల నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల సారథ్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇది రాజకీయ పరమైన అంశం కాదని .. యావత్తు తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతితో పాటు పలువురు కేంద్ర మంత్రులు తాము నిర్వహించే విమోచన వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన నిర్వహించే విమోచన వేడుకలకు హైదరాబాద్, తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా రావాలని కోరారు.

**అందుకోసమే విమోచన దినోత్సవం నిర్వహిస్తున్నాం..**

సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది విలీనం, విద్రోహం అనేవాళ్లకు తాము తెలంగాణ స్వాత్రంత్ర్యం అంటామంటామని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం ప్రభుత్వాల విధి అని తెలిపారు. అందుకోసమే విమోచన దినోత్సవం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ మీద.. సీఎం రేవంత్‌రెడ్డి చేసే విమర్శలపై సమయం వచ్చినపుడు స్పందిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు.. గృహ నిర్మాణ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్ష

'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళు ,, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**ఉచిత ఇళ్ల స్థలాల పై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక**

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి,పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# నా పీఆర్ఓ, పీఏ పై 15 మంది గూండాలు దాడి చేశారు

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## బ్రిక్స్ సదస్సులో బాలీవుడ్ మ్యాజిక్.. పాటలతో దౌత్యం నెరిపిన మలేషియా ప్రధాని

న్యూఢిల్లీలో ఇటీవల ముగిసిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రాజకీయ, దౌత్యపరమైన చర్చలకే పరిమితం కాలేదు. అనూహ్యంగా భారతీయ సంగీతం, ముఖ్యంగా బాలీవుడ్ పాటలు ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందుకు కారణం మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం. తన భారత పర్యటనకు సంబంధించిన ప్రతి ఫొటో, వీడియోకు ఆయన ఎంచుకున్న బాలీవుడ్ పాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సదస్సు జరిగిన భారత్ మండపంలోకి ప్రధాని నరేంద్ర మోదీ తనకు స్వాగతం పలుకుతున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన అన్వర్ ఇబ్రహీం, దానికి షారుఖ్ ఖాన్, కాజోల్ నటించిన 'దిల్వాలే దుల్హనియా లే జాయేంగే' సినిమాలోని 'తుఝే దేఖాతో యే జానా సనమ్' పాటను జతచేశారు. బ్రిక్స్ సదస్సులో తాను ప్రసంగిస్తున్న ఫొటోలకు సల్మాన్ ఖాన్ నటించిన 'హర్ దిల్ జో ప్యార్ కరేగా' పాటను, భారత్ నుంచి తిరిగి వెళ్తున్నప్పుడు 'లక్ష్య' సినిమాలోని 'కంధో సే మిల్తే హై కంధే' గీతాన్ని ఉపయోగించారు. ఈ రెండు పాటలు ఐక్యత, కలిసికట్టుగా ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తాయి. తన పర్యటనలో భాగంగా అన్వర్ ఇబ్రహీం కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా సమావేశమయ్యారు. వారితో కలిసి భోజనం చేస్తున్న చిత్రాలను పంచుకుంటూ, 'వీర్-జారా' సినిమాలోని 'ఐసా దేస్ హై మేరా' పాటను జోడించారు. ఈ పాట భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని చాటిచెబుతుంది. అయితే, ఆయన పాటల ఎంపికలో అత్యంత ఆసక్తికరమైనది ఇరాన్, రష్యా అధ్యక్షులతో భేటీల సందర్భంగా కనిపించింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో సమావేశమైన పోస్టుకు 1957 నాటి 'నయా దౌర్' సినిమాలోని 'సాథీ హాత్ బఢానా' పాటను ఎంచుకున్నారు. కలిసికట్టుగా చేతులు కలిపి ముందుకు సాగాలనే అర్థం వచ్చే ఈ పాట, ఇరు దేశాల బంధాన్ని బలపరిచే సందేశాన్ని ఇచ్చింది. అలాగే, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఉన్న చిత్రానికి ఆమిర్ ఖాన్ 'లగాన్' సినిమాలోని 'చలే చలో' పాటను జతచేశారు. సవాళ్లను ఎదుర్కొని కలిసికట్టుగా ముందుకు సాగాలనే స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తుంది. మలేషియా ప్రధానే కాకుండా, ఇండోనేషియా విదేశాంగ మంత్రి కూడా తమ దేశాధ్యక్షుడి పర్యటనకు 'దిల్ ధడక్నే దో' సినిమా పాటను వాడటం గమనార్హం. అత్యంత క్లిష్టమైన పశ్చిమాసియా సంఘర్షణపై కూడా అందరి ఆమోదంతో ఒక ప్రకటన విడుదల చేయగలిగాం" అని ఆయన వివరించారు.

## చైనాలో కొత్త చట్టాలు.. పరారీలో హువావే వ్యవస్థాపకుడు రెన్ జెంగ్

ప్రముఖ చైనా టెక్ దిగ్గజం హువావే వ్యవస్థాపకుడు, సీఈవో రెన్ జెంగ్‌ఫీ దేశం విడిచి వెళ్లారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. చైనాలో నేటి నుంచి కఠినమైన నిష్క్రమణ నియంత్రణ చట్టాలు అమల్లోకి వచ్చిన తరుణంలో ఈ వదంతులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, ఈ వార్తలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. చైనా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో పాటు 'ఎక్స్'లో వైరల్ అవుతున్న పోస్టుల ప్రకారం, సెప్టెంబర్ 11వ తేదీ నుంచే రెన్ జెంగ్‌ఫీ, ఆయన భార్య, కుమార్తె సహా పది మందికి పైగా కుటుంబ సభ్యులు ఎవరికీ అందుబాటులో లేరని సమాచారం. అర్ధరాత్రి వేళ ఆయన నివాసం నుంచి ఒక వాహనం షెన్‌జెన్‌లోని తీర ప్రాంతం వైపు వెళ్లినట్లు, వారు సముద్ర మార్గం ద్వారా దేశం విడిచి పారిపోయి ఉండవచ్చని ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు, షెన్‌జెన్‌లోని హువావే ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారని, ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం లేదంటూ కొన్ని అంతర్గత చాట్ స్క్రీన్‌షాట్లు కూడా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అయితే, ఇవన్నీ బలహీనమైన ఆధారాలతో కూడిన కథనాలని, వీటిని సులభంగా సృష్టించవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాలో పారిశ్రామిక, సాంకేతిక భద్రతకు ముప్పు కలిగించే వారు దేశం విడిచి వెళ్లకుండా నిరోధించేందుకు రూపొందించిన కొత్త నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ప్రచారంపై అటు హువావే సంస్థ కానీ, ఇటు చైనా ప్రభుత్వం కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## లోతుకుంట భూములపై సుప్రీంకోర్టు తీర్పు..

సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ తిరస్కరణకు ప్రధానంగా కాలపరిమితికి సంబంధించిన సాంకేతిక అంశాలు కారణమయ్యాయని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి చర్యలను అన్ని సంబంధిత వర్గాలతో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. లోతుకుంట పరిధిలోని భూములపై స్పష్టత కోసం సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జనరల్ ల్యాండ్ రిజిస్టర్‌లోని 243వ నంబర్‌కు సంబంధించిన సుమారు 119 ఎకరాల భూములపై సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. భూముల హద్దులు, ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా వివాదానికి సంబంధించిన వాస్తవాలు మరింత స్పష్టమవుతాయని చెప్పారు. ఇదిలా ఉండగా, సర్వే నంబర్లు 1, 2లో ఉన్న శాంతా శ్రీరామ్ బిల్డర్స్ లేఅవుట్‌కు, హైడ్రా పరిరక్షణలో ఉన్న ప్రభుత్వ భూమికి మధ్య దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఉన్నట్లు రంగనాథ్ వివరించారు. ఈ రెండు ప్రాంతాలను ఒకే భూమిగా పరిగణించడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. సర్వే నంబర్లు 1, 2లోని ప్రైవేటు భూమికి సంబంధించి కోర్టులు ఇచ్చిన ఆదేశాలు, జీఎల్ఆర్ 243, 255లో నమోదైన భూములకు వర్తించవని హైడ్రా అభిప్రాయపడుతోంది. ఈ అంశంపైనే వివిధ దశల్లో న్యాయపోరాటం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. భూ హక్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో న్యాయస్థానాల ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూనే ముందుకు వెళ్తామని రంగనాథ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పు అనంతరం ప్రభుత్వం, సంబంధిత సంస్థలు, ఇతర భాగస్వాములతో చర్చించి తదుపరి కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తంగా లోతుకుంట భూములపై వివాదానికి శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా సర్వే కీలకంగా మారే అవకాశం ఉంది. సర్వే పూర్తయిన తర్వాత భూముల హద్దులు, హక్కులు, రికార్డులకు సంబంధించిన అంశాల పై మరింత స్పష్టత వచ్చే అవకాశముంది.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## అమెరికా రాజకీయాల్లో 'సోషలిస్ట్' హవా!



ఒకటిన్నర దశాబ్దం తర్వాత అమెరికా భారీ రాజకీయ కుదుపునకు లోను కాబోతున్నదా? చాపకింద నీరులాగా డెమోక్రాట్లలో తమ ప్రాబల్యం పెంచుకుంటున్న డెమోక్రటిక్ సోషలిస్టులు అమెరికా రాజకీయ విధాన స్వరూపాలను పునర్నిర్వచించే బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్నారా? డెమోక్రాట్ల ప్రైమరీస్ ఎన్నికలలో నమోదవుతున్న కొన్ని విజయాలు ఈ ప్రశ్నలు రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు గెలుస్తున్నారు. వారి గళం కొత్త నినాదాలను లేవనెత్తుతున్నది. ఆ స్వరాల సంఖ్య ప్రస్తుతానికి పరిమితమే కానీ, తమ వాదనల ద్వారా వారు సంప్రదాయ డెమోక్రాట్లలో కూడా మద్దతును కూడగట్టకుంటున్నారు.మిషిగన్‌లో ప్రైమరీస్ ఎన్నికలలో అబ్దుల్ ఎల్ సయీద్ విజయం ఇందుకు తాజా ఉదాహరణ. డెమోక్రాట్ సోషలిస్ట్ అయిన సయీద్ అయిదుసార్లు కాంగ్రెస్ ఉమన్‌గా ఉన్న హేలీ స్టీవెన్స్‌ను స్వల్ప మెజారిటీతో ఓడించారు. డిస్ట్రిక్ట్ ప్రైమరీస్‌లో థాణేదార్‌ను డెమోక్రాట్ సోషలిస్టు డొనావన్ మెకిన్నీ ఓడించారు. అలాగే తాజా విజయాలు నమోదు చేసిన రషిదా త్లయిబ్, క్రిస్ గ్లిమర్ హిల్‌లు కూడా డెమోక్రటిక్ సోషలిస్టులే. ఈ విజయాలన్నీ డెమోక్రాట్లలో సోషలిస్టుల ఆధిపత్యం పెరుగుతోందన్న వాదనకు కొనసాగింపు మాత్రమే. న్యూయార్క్ సిటీ మేయర్ జొహ్రాన్ మందానీ వీరిలో ప్రముఖుడు. డెమోక్రాట్ సోషలిస్టుల భావజాలంతో కూడిన ప్రకటనలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి కూడా. అమెరికాను మరింత సోషలిజం వైపు తీసుకెళ్లాలనే వాదన డెమోక్రాట్లలో పెరుగుతోంది. ప్రైవేట్ హెల్త్ కేర్ రంగాన్ని సమూలంగా తొలగించడం, పోలీసులకు నిధులను తగ్గించడం వంటివి వీరు ప్రధానంగా తెరమీదకు తెస్తున్నారు. సొంత ఇంటి కల కోసం తాకట్టులు పెట్టాల్సిన పరిస్థితి ఉండదనే ప్రజాకర్షక ప్రకటనలతో వీరు ముందుకు వస్తున్నారు. అంతేకాదు, సెనేట్, ప్రెసిడెన్సీ, సుప్రీంకోర్టు వ్యవస్థలలో కూడా భారీ మార్పులు రావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా అమెరికాలో రాజకీయ నాయకుల మాటలు, ప్రకటనలు, వాగ్దానాలు రెండు రకాలు. ప్రజల్లోంచి ఎన్నికవడానికి పార్టీ అభ్యర్థిగా వచ్చినప్పుడు ఒకరకమైన వాగ్దానాలు ఉంటాయి. పార్టీ అభ్యర్థిగా ఎంపికవడానికి ప్రైమరీస్ ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆ మాటలు మరో రకంగా ఉంటాయి. సాధారణ ఎన్నికలంటే అన్ని వర్గాల, భిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ప్రజల ఓట్లను రాబట్టేలా మాటలు ఉండాలి. కానీ ప్రైమరీస్ అలా కాదు. ప్రైమరీస్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోవడమే ప్రధానం. పార్టీలో ఇంచుమించుగా తమ భావజాలానికి చెందినవారే కార్యకర్తలుగా ఉంటారు. కాబట్టి సారూప్యత ఉన్న తమ భావజాలంలోనే, కొన్ని అతివాద ధోరణులను ప్రదర్శించడం ద్వారా వారిని ఆకట్టుకోవాలి. డెమోక్రాట్ సోషలిస్టులు చేస్తున్నది అదే. 'మరింత సోషలిజం-- మరింత సమానత్వం' దిశగా తమ ఎజెండాను ప్రాజెక్ట్ చేస్తూ డెమోక్రాట్ పార్టీ ప్రైమరీస్‌లో వీరు నెగ్గుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూల మార్పులు తేవడం, పని అవసరం తక్కువ చేయడం, జరిమానాలు, అప్పులు, తాకట్టులు లేని సమాజం, అందరికీ సమానమైన-- ప్రభుత్వపరమైన ఆరోగ్యభద్రత లాంటివి వీరి ఎజెండా అంశాలు. డెమోక్రాటిక్ సోషలిస్టులు వ్యాప్తిచేస్తున్న భావజా లంలో, యుద్ధాలు లేని సమాజం, జాతి లింగ వివక్షలను రూపుమాపడం వంటివీ ఉన్నాయి. ఇరాన్, క్యూబా, వెనెజువెలా వంటి దేశాలతో ఆంక్షలు లేని, నియంత్రణలు లేని సంబంధ బాంధవ్యాలు కావాలనే డిమాండ్ కూడా ఉంది. ఈ పరిణామాలను విశ్లేషకులు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో రిపబ్లికన్ పార్టీలో మొదలైన టీపార్టీ ఉద్యమంతో పోలుస్తున్నారు. అప్పట్లో ఒబామా పాలన నాటి హెల్త్ కేర్ సంస్కరణలు, ప్రభుత్వ వ్యయాలు, పన్నుల విధానాలను కొందరు కన్జర్వేటివ్ నాయకులు వ్యతిరేకించారు. వారు నిరసనలతో ఆగలేదు. తమ బలమైన వ్యతిరేకతతో ఏకీభవించే వారినే రిపబ్లికన్ ప్రైమరీస్‌లో పోటీచేయి ంచారు. ఆ పార్టీలో అప్పటికే గుర్తింపు పొందిన అభ్యర్థి కంటే, మరింత కన్జర్వేటివ్ ఆలోచనలున్న అభ్యర్థులకే ఈ టీపార్టీ ఉద్యమకారుల అండ లభించింది. 'డెమోక్రాట్లను ఓడించడం మాత్రమే కాదు, రిపబ్లికన్ పార్టీ గమనాన్ని కూడా మరింత కన్జర్వేటివ్‌గా పునర్నిర్దేశిస్తాం' అన్నట్టుగా వారి ధోరణి సాగింది. వీరు 63 సీట్లు గెలిచి రిపబ్లికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నియంత్రణ మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. సెనేట్‌లో 6 సీట్లు గెలిచినా మెజారిటీ దక్కలేదు. అప్పటివరకు ఉదారవాద-- కన్జర్వేటివ్ భావజాలాల మిశ్రమంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎక్కువ కన్జర్వేటివ్‌గా మారింది. టీపార్టీ ఉద్యమం ద్వారా బలపడిన కన్జర్వేటివ్ వాదులు రిపబ్లికన్ పార్టీలో క్రమంగా ఆధిపత్యం సాధించిన తీరు, ఇప్పటి డెమోక్రటిక్ పార్టీలో సోషలిస్టుల ప్రాబల్యం పెరుగుత ుండడానికి దగ్గరగా ఉంది. ఈ క్రమంలో డెమోక్రటిక్ పార్టీ అతివాద సోషలిస్టుల చేతిలోకి పూర్తిగా వెళ్లిపోతే గనుక, అమెరికా భవిష్యత్ రాజకీయ విధానాల్లోనే భారీ కుదుపు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ సోషలిస్టు ఎజెండాను అమెరికా పౌరసమాజం ఎలా స్వీకరిస్తుందో చూడాలి.

# పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా ఆకస్మిక పరిశీలన





పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా కార్య నిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు (15.09. 2026) సాయంత్రం పలువిభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఉచిత ప్రసాద వితరణ, లడ్డు ప్రసాదాల విక్రయకేంద్రాలు మరియు అన్నప్రసాదవితరణ విభాగాలను పరిశీలించడం జరిగింది.

ఈ సందర్భంగా కార్య నిర్వహణాధికారివారు మాట్లాడుతూ అమ్మవారి ఆలయం వెనుకభాగంలో భక్తులకు అందజేస్తున్న ఉచిత ప్రసాద వితరణ ఎటువంటి అంతరాయం లేకుండా జరుగుతుం డాలన్నారు. దర్శనాల ప్రారంభం నుంచి దర్శనాలు ముగిసేంతవరకు ఈ ప్రసాదవితరణ ఉండాలన్నారు. ఆలయ అధికారులు ఈ ప్రసాద వితరణను నిరం తరం పర్యవేక్షిస్తుండాలన్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ప్రతీ భక్తుడికి కూడా ఉచిత ప్రసాదం అందజేయడం ఎంతో ముఖ్యమన్నారు.

తరువాత లడ్డు ప్రసాదవిక్రయ కేంద్రాలను పరిశీలించారు. భక్తులు అధికసమయం క్యూలైన్లలో వేచివుండకుండా త్వరితంగా ప్రసాదాలను అందించేందుకు చర్యలు చేపట్టాలని విక్రయకేంద్ర పర్యవేక్షకులను ఆదేశించారు. ముఖ్యంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులరద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు అవసరం మేరకు అదనపు కౌంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు.

అనంతరం అన్నప్రసాద వితరణ విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అధికారులు ప్రతీరోజు కూడా అన్నప్రసాదాన్ని స్వీకరించే భక్తులతో మాట్లాడుతూ వారియొక్క అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా అన్నప్రసాదాల వడ్డన, రుచి మొదలైన అంశాల గురించి భక్తుల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు.

అదేవిధంగా కాలాతీతం కాకుండా నిర్ణీత వేళలో అన్నప్రసాద వితరణ ప్రారంభం కావాలన్నారు.

అన్నప్రసాదవితరణలో శివసేవకుల సేవలను విరివిగావినియోగించుకోవాలన్నారు. అన్నప్రసాదాల వడ్డన తదితర అంశాలపై శివసేవకులకు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు.

అదేవిధంగా అన్నప్రసాదాల వడ్డనపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రతీ వంటకం కూడా ప్రతీ భక్తుడికి చేరేవిధంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతీ హాలును కూడా సిబ్బంది ప్రత్యేకంగా నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు.

అన్నప్రసాదాల తయారీలో తాజా కూరగాయలనే వాడాలన్నారు. అదేవిధంగా రోజువారీ వంటకాలలో పలురకాల కూరగాయలు వాడాలని అధికారులను ఆదేశించారు. వంటకాలు రుచికరంగా ఉండేవిధంగా అన్నీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అన్నప్రసాదవితరణ వంటశాలలోనూ, ప్రసాదవితరణ చేసే హాలులలోనూ మరియు భవన ప్రాంగణములో శుచీ శుభ్రతపట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు.

కాగా ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు ఉచిత ప్రసాదవితరణ వద్ద పలువురు భక్తులతో నేరుగా మాట్లాడి దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి






**-14 మంది అర్జీదారులతో చరవాణిలో నేరుగా మాట్లాడి పరిష్కారాలపై ఆరా...**

**-సమస్యలు పరిష్కారం కావడంతో సంతృప్తి వ్యక్తం చేసిన అర్జీదారులు...**

భీమవరం సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికా రులతో నిరంతరం సమన్వయం చేస్తూ, సమస్యల పరిష్కారం అనంతరం అర్జీదారులతో స్వయంగా చరవాణిలో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసు కుంటున్నారు. ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు అందిస్తూ, ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీలు సమర్పించిన వారిలో జిల్లాకు చెందిన 14 మంది అర్జీదారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చరవాణి ద్వారా నేరుగా మాట్లాడి, వారి సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, సమస్యల పరిష్కారం తీరును అర్జీదారులను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కారం కావడంతో అర్జీదారులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు.భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన వర్ధనపు సుబ్బలక్ష్మి భూ వివాదానికి సంబంధించి కక్షిదారులు బెదిరిం పులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి సమస్యను పరిష్కరిం చడంతో పాటు అర్జీదారుకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కక్షిదారులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేయడంతో సమస్య పరిష్కారమైంది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్వయంగా చరవాణిలో సుబ్బలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా, ఆమె సంతోషం, సంతృప్తి వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.భీమవరం 1వ వార్డుకు చెందిన మలపాక శరత్‌చంద్ర కోవిడ్ సమయంలో పొందిన వైద్య చికిత్సకు ఆర్థిక సహాయ ం అందించాలని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.10 లక్షలు మంజూరు కావడంతో జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడి కృతజ్ఞతలు తెలిపారు. వీరవాసరం మండలం నవుదూరు గ్రామానికి చెందిన పి. విఘ్నేశ్వరరావు భూ వివాదంలో కక్షిదారుల నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్నారని, రక్షణ కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. దీనిపై అధికారు లు స్పందించి అర్జీదారుకు రక్షణ కల్పించడంతో పాటు కక్షిదారులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. సమస్య పరిష్కారం కావడంతో విఘ్నేశ్వ రరావు జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలియజేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వీరవాసరం గ్రామానికి చెందిన పీతల కాంతరత్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గతంలో ఉన్న ప్రదేశంలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి కార్యాల యానికి అర్జీ సమర్పించారు. అర్జీపై జిల్లా కలెక్టర్ నాగరాణి స్పందించి పాఠశాలను యథాస్థానంలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టారు. దీంతో కాంత రత్నం సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం 1వ వార్డుకు చెందిన సిహెచ్. రాజాకుమార్ సర్వశిక్ష అభియాన్‌లో ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ విద్యాబోధకుడిగా పనిచేస్తున్న తనను విధుల నుంచి తొలగించారని, తిరిగి విధుల్లో కొనసాగించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ సమర్పించారు. దీనిపై స్పంది ంచి, ఆయనను తిరిగి విధుల్లో కొనసాగించేందుకు అనుమతుల కోసం సర్వశిక్ష అభియాన్‌కు నివేదిక పంపారు. ఈ చర్యపై రాజాకుమార్ జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడుతూ సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, దాని పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్ నాగరాణి పనిచేస్తున్నారు. ముఖ్య మంత్రి కార్యాలయం ద్వారా వచ్చిన అర్జీలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారు లతో సమన్వయం చేసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్య పరిష్కారం అనం తరం అర్జీదారులతో స్వయంగా చరవాణిలో మాట్లాడి వారి సంతృప్తిని తెలుసుకోవడం ద్వారా ప్రజల పట్ల తన బాధ్యతాయుత మైన విధానాన్ని చాటుతున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సమర్థవంతమైన పరిష్కారం చూపించడమే ప్రజల సమస్యల పరిష్కార వేదిక ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి అర్జీదా రుడికి సమస్య పరిష్కారమయ్యేలా బాధ్యతతో పనిచేయాలని ఆమె ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలి: జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ఒంగోలు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

పోక్సో కేసుల్లో బాధితులైన చిన్న పిల్లల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఆమె ఛాంబర్ లో కల్పనా కుమారి అధ్యక్షతన పోక్సో కేసులు, బాలల హక్కుల పరిరక్షణపై వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కల్పనా కుమారి మాట్లాడుతూ... జిల్లాలో నమోదైన పోక్సో కేసులను సంబంధిత శాఖాధిపతులతో కేస్ టు కేస్ క్షుణ్ణంగా సమీక్షించారు. లైంగిక వేధింపులు మరియు దాడులకు గురైన బాలబాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కింది స్థాయి సిబ్బంది లేదా బాధ్యత వహించే వారు ఎవరైనా తప్పు చేసినా, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదాసీనత వహించేది లేదని, వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న బాలసదనములు మరియు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సంరక్షణ కేంద్రాలలో తాత్కాలిక నిమిత్తం ఉంచిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వారి ఆహారం, ఆరోగ్యం, సురక్షితమైన వసతి కల్పనలో ఎలాంటి లోపాలు లేకుండా పిల్లలను ఎంతో ప్రేమగా, బాగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేసుల విచారణ పురోగతిని, బాలల సంరక్షణ చర్యలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు గానూ రాబోయే పది రోజుల్లో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మరొకసారి ప్రత్యేకంగా పోక్సో కేసుల రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తెలియజేశారు.



?ఈ సమీక్షా సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ సునంద, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణ్ నాయక్, జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి సువార్త, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్ కుమార్ మరియు వివిధ శాఖల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 16 సెప్టెంబర్ 2026

# వినాయక నిమజ్జనాలకు పటిష్ట భద్రత చేపట్టండి- ఎస్పీ



వెలుగోడు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

వినాయక నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రత చర్యలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశించారు.మంగళవారం ఆత్మకూరు సబ్ డివిజన్ లోని వెలుగోడు పోలీస్ స్టేషన్ల పరిధిలో గల వినాయక నిమజ్జన ఘాట్‌లను, మరియు ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాలను స్వయంగా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. వెలుగోడు పట్టణం లో ప్రధాన విధులలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎస్పీ పరిశీలించారు. వెలుగోడు రిజర్వాయర్ వద్ద గల నిమజ్జనం చేసే మద్రాస్ కాల్వ ను చూసి, నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై పోలీస్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీ కరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు పోలీసులకు సహక రించి, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధ నలను పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ ,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అశోక్, ఆత్మకూరు రూరల్ సి. ఐ సురేష్ కుమార్ రెడ్డి , వెలుగోడు ఎస్. ఐ సురేష్ పాల్గొన్నారు.

## జిల్లాలోప్రజా ప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి






**-స్థానిక అవసరాలు, ఆర్థిక వనరులు, అభివృద్ధి అవకాశాల ఆధారంగా విజన్ ప్లాన్ సిద్ధం చేయాలి**

**-తలసరి ఆదాయం, జీడీపీ పెంపునకు రంగాల వారీగా కార్యాచరణ రూపొందించాలి**

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

జిల్లాలో ప్రజాప్రతినిధుల సూచనలు, నియోజకవర్గ అవసరాలు, ఆర్థిక సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (విజన్ ప్లాన్) రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సమావేశంలో సిపిఓ ప్రకాష్, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిఎల్డిఓలు, అన్ని నియోజకవర్గాల నోడల్ అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ స్థాయిలో తలసరి ఆదాయం, జీడీపీ పెంపునకు ఉన్న అవకాశాలను గుర్తించి, వ్యవసాయం, ఉద్యానవన, పరిశ్రమలు,సేవా, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్‌అ ధికారులకు ఆదేశించారు. ప్రతి నియోజ కవర్గానికి సంబంధించిన ఆర్థిక గణాంకాలను విశ్లేషించి, అభివృద్ధికి అత్యధికంగా దోహదపడే రంగాలను గుర్తించాలన్నారు. అధిక ఆదాయం వచ్చే ఉద్యానవన పంటలు, అంతర పంటలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎమ్మెస్ ఎంఈ లు, సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించేలా ప్రతిపా దనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక వనరులు, ఉత్పత్తుల ఆధారంగా కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సర్క్యూట్ టూరిజం, సేవా రంగం విస్తరణకు ఉన్న అవకాశాలను గుర్తించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి విజయగాథలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. నియోజకవర్గం, మండలం, సబ్‌సెక్టార్ స్థాయిలో ఖచ్చితమైన డేటాబేస్‌ను రూపొందించి, దాని ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెల ఎకనామిక్ రిపోర్ట్, మంత్లీ బులెటిన్ రూపొంది ంచడంతో పాటు కేపీల డేటా ఎంట్రీ, విశ్లేషణను క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, పి4 కార్యక్రమం పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, నియోజకవర్గానికి అవసరమైన కోర్ ఎజెండా, ప్రాధాన్యతా అంశాలపై దృష్టి సారించి, ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# సంజామలలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం





**-అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ పనులు వేగవంతం చేయాలి**

**-నాణ్యతకు పెద్దపీట వేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

నంద్యాల సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

సంజామల పట్టణ ప్రజల దీర్ఘకాలిక మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన నూతన అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ పనులను రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పట్టణంలో జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి.. సంబంధిత అధికారులను అడిగి పనుల పురోగతి వివరాలు తెలుసుకున్నారు.అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే సంజామల పట్టణంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు పట్టణలో పారిశుధ్యం మరింత మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే ందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.పట్టణాల అభివృ ద్ధిలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతృత్వంలోని కూటమి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను చేపట్టి వాటి ఫలాలు ప్రజలకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.



# పోషక పంటల సాగును ప్రోత్సహించాలి

బాపట్ల, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడంతో పాటు తక్కువ నీటితో సాగు చేసే పోషక పంటలను ప్రోత్సహి ంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట ్లో జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.మిషన్ ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, పంటల సాగు పరిస్థితులు, విత్తనాల లభ్యత, ప్రదర్శనా క్షేత్రాలు, రైతులకు అందుతున్న సాంకేతిక సహాయం, శిక్షణ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధుని క సాగు పద్ధతులు, శాస్త్రీయ పరిజ్ఞానం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అధిక దిగుబడినిచ్చే విత్తనాల వినియోగం, సమతుల్య ఎరువుల వాడకం, సమగ్ర పురుగు--తెగుళ్ల నియంత్రణ, నీటి పొదుపు, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. 2026--27లో పోషక నిర్వహణ, మొక్కల రక్షణ చర్యలకు 100 హెక్టార్ల చొప్పున లక్ష్యాలు నిర్దేశించి రూ.2.5 లక్షల ఆర్థిక కేటాయింపు చేసినట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునే తక్కువ నీటి



పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వరికి బదులుగా చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాపట్ల ప్రాంతం అందుకు అనుకూలమని కలెక్టర్ పేర్కొన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే బుడ్డా



వెలుగోడు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం:

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. మంగళవారం వేల్పనూరు నందు నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 53 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతుందని అన్నారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం : ఇటీవల ప్రమాద వశాత్తు మరణించిన గాజులపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కొలిమి మక్తుమ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సహకారంతో రూ.5 లక్షలు భీమా సొమ్మును మంజూరు చేయించి, వారి కుటుంబ సభ్యులకు అందజేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజన్న.కార్యకర్త కొలిమి మక్తుమ్ మరణం పార్టీకి తీరనిలోటు, కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.

## సమతుల్య పోషక యాజమాన్యం పై శిక్షణ



వెలుగోడు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య పోషక యాజమాన్యాన్ని రైతులు పాటించాలని వెలుగోడు మండల వ్యవసాయాధికారి ఎస్ స్వాతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రేగడ గూడూరు వేల్పనూరు గ్రామాలలో రైతులకు పప్పు గింజల జాతీయ మిషన్ ఆత్మనిర్భరత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సమతుల్య పోషక యాజమాన్యం ద్వారా పంటలకు కావాలసిన అన్ని రకాల పోషకాలను సరైన నిష్పత్తి సరైన సమయం. సరైన పద్ధతిలో వేయడం జరుగు తుందన్నారు. దీని వల్ల నేల సారం దెబ్బతినకుండా స్థిరమైన, అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. అదేవిధంగా జాతీయ ఆహార భద్రత ఆత్మనిర్భారత మరియు సోయా చిక్కుడు నూనె గింజల జాతీయ మిషన్లో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, పంటల యాజమా న్యంపై అవగాహన కల్పించారు. అలాగే రేగడ గూడూరు మరియు వేల్పనూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

## మధ్యప్రదేశ్ రాష్ట్రానికి.. ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో బదిలీ..!

**-ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారుల ఉత్తర్వులు జారీ**



ఆత్మకూరు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావో ను మధ్యప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు ఆత్మకూరు వన్యప్రాణి అటవీ డివిజన్లో పెద్దపులుల సంరక్షణ లో ఎంతో కీలకంగా విగ్నేష్ అపావో విధులు నిర్వహించారు అటవీ శాఖలోనే విగ్నేష్ అపావో సతీమణి రిషిబా మధ్యప్రదేశ్ రాష్ట్రంలో విధులు నిర్వహించడంతో ఇద్దరినీ ఒకే చోట విధులు నిర్వహించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కీలకమైన నిర్ణయం తీసుకోవడంతో ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విగ్నేష్ అపావోను మధ్యప్రదేశ్ కు బదిలీ చేయడం అటవీ శాఖలో ఉన్నతాధికారుల ఉత్తర్వులు జారీ చేశారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
బుధవారం 16 సెప్టెంబర్ 2026

## కే.సి.కెనాల్ లో ప్రమాదవశాత్తుపడి పదో తరగతి విద్యార్థి మేకల లింగస్వామి మృతి

జూపాడుబంగ్లా,సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం



మండలంలోని, తూడిచెర్ల మజారా గ్రామమైన కనకయ్య కొట్టాల లో పదో తరగతి చదువుతున్నటువంటి విద్యార్థి మేకల లింగస్వామి (14) ప్రమాదవశాత్తు కే.సి.కెనాల్ 114వ తూము వద్ద కాలకృత్యాలు చేసుకునే సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మరణించడం జరిగింది. ఈ సంఘటన జరగడంతో తండ్రి మేకల శివలింగేశ్వరుడు, తల్లి మేకల మధులత ల చిన్న కుమారుడు లింగస్వామి మరణిం చడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పిల్లలు సెలవు దినాలలో, ఇతర దినాలలో వాగులు, వంకలు, నదులు, బావుల దగ్గరకు వెళ్లి ప్రమాదాలు తెచ్చుకోకూడదని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు ఇటువంటి సంఘటనలు జరగకుండా తమ పిల్లలను జాగ్రత్తగా తమ అదుపులో ఉంచుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

## సీఎం పర్యటనకు సన్నాహాలు

-ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సాయికాంత్‌వర్మ



గుంటూరుసెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో ఈ నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ సి.ఎం. సాయికాంత్‌వర్మ మంగళవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.సీఎం పర్యటన నేపథ్యంలో అబ్బరాజుపాలెంలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పర్యటన ప్రాంతం, రహదారులు, పార్కింగ్, భద్రత, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్.. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేలా చేపట్టాల్సిన చర్యలపై కూడా దృష్టి సారించారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి. రవికుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం భాషా, రహదారులు-భవనాల శాఖ కార్యనిర్వహణ ఇంజినీర్ సి.విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి



బాపట్ల,సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల డ్రాప్‌అవుట్‌ను పూర్తిగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో పాఠశాలల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 95.16 శాతం అప్పర్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. రోజువారీ హాజరు తక్కువగా ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి కారణాలను తెలుసుకోవాలని ఎస్‌జీఎస్‌డబ్ల్యూ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యం, బోధనా ప్రమాణాలు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల మార్కులు పెరిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డాష్‌బోర్డులో జిల్లాకు వెనుకబడిన అంశాలను గుర్తించి పురోగతి సాధించాలని తెలిపారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల నిర్వహణకు ప్రతిపాదనలు పంపాలని, బాలికలు, బాలురకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఏఎల్ ల్యాబ్‌లకు అవసరమైన సాంకేతిక పరికరాలను సేవాసేతు యాప్‌లో నమోదు చేసి దాతల సహకారం పొందాలని సూచించారు. సమావేశంలో డీఈఓ శ్రీనివాస్ నాయక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం, టిడ్కో ఇల్లు అందేలా చర్యలు





-ఆన్‌లైన్‌లో వచ్చిన ఇంటి పట్టాల దరఖాస్తులను

-క్షుణ్ణంగా పరిశీలించాలి-మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

నంద్యాల నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి స్థలం, టిడ్కో ఇళ్ల కేటాయింపు జరిగేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాలలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లతో కలిసి నంద్యాల నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపులపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలో టిడ్కో ఇళ్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్, ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలు తదితర అంశాలపై అధికారులను మంత్రి అడిగి తెలుసు కున్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్లను గరిష్ట స్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు కేటా యించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశిం చారు. అందుబాటులో ఉన్న ఇళ్లను ఖాళీగా ఉంచకు ండా అర్హత కలిగిన లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. నంద్యాల నియోజక వర్గంలో ఇంటి పట్టాల కోసం ఆన్‌లైన్‌లో దాదాపు 7,000 మంది దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఇంటి పట్టాలు మంజూరు చేసే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, నిబంధనల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్ల కేటాయింపునకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రయోజనం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల అర్హత నిర్ధారణ, తదుపరి కేటాయింపు ప్రక్రియను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ ఈఈ, టిడ్కో ఈఈ, నంద్యాల మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, నంద్యాల, నంద్యాల రూరల్, గోస్పాడు తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలోనైపుణ్య శిక్షణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలి





-యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

-నైపుణ్యం పోర్టల్ లో విద్యార్థులందరి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శిక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో వృత్తి నైపుణ్యం, ఉపాధి శిక్షణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ స్కిల్ ఆఫీసర్ సోమశివారెడ్డి, గవర్నమెంట్ ఐటిఐ కళాశాల కన్వీనర్ నాగ కేశాలు, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, బేతంచెర్ల ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా సాధించేలా సమన్వ యంతో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పీఎం సెట్ పథకం కింద నంద్యాల జిల్లాలోని డోనే ఐటిఐ క్లస్టర్ కు ఆంచార్ ఇండస్ట్రీ పార్టనర్ గా వ్యవహరించేందుకు అర్హత కలిగిన పరిశ్రమలను గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రూ.500 కోట్ల టర్నోవర్‌తో పాటు కనీసం 250 మంది ఉద్యోగుల బలగం కలిగిన పరిశ్రమలను గుర్తించి, వాటిని డోనే ఐటిఐ క్లస్టర్ తో అనుసంధానం చేయాలని సూచించారు. అర్హత కలిగిన పరిశ్రమల గుర్తింపు, అనుసంధానం అనంతరం పీఎం సెట్ పథకం అమలుకు అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

-నైపుణ్య శిక్షణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలి

జిల్లాలోని స్కిల్ హబ్స్ కు కేటాయించిన పీఎంకేవీ మరియు రాష్ట్ర నైపుణ్య శిక్షణ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించేలా శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణకు అర్హులైన యువతను గుర్తించి, వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలకు అనుసంధానం చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా DDU-GKY 2.0 ద్వారా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు శిక్షణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.లి

-కోర్సుల లక్ష్యాలను పూర్తి చేయాలి

నేషనల్ అకాడమీ అఫ్ కన్స్ట్రక్షన్స్ (NAC)కు కేటాయించిన బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించేలా శిక్షణ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జాబ్ మేళాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలి. జిల్లాలో నిర్వహిస్తున్న జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హెడ్ ఆఫీస్ ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించేలా ఉద్యోగదాతలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేసి, అర్హత కలిగిన అభ్యర్థులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా జాబ్ మేళాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఇంటర్మీడియట్, ఐటిఐ , పాలిటెక్నిక్, డిగ్రీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులందరినీ నైపుణ్యం పోర్టల్ .(ap.gov.in)లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, ఉపాధి ఆసక్తులకు అనుగుణంగా భవిష్యత్తులో శిక్షణ, ఉద్యోగ అవకాశాలను అనుసంధానం చేసేందుకు నైపుణ్యం పోర్టల్ ను సమర్థవంతంగా వినియోగిం చుకోవాలని సూచించారు. సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## జిల్లాలో వినాయక నిమర్జనం వేడుకలను ప్రశాంతంగా జరుపుకుందాం

-ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో జిల్లా ఎస్పీ నిమజ్జన ఘాట్లు పరిశీలన

-శాంతియుతంగా వేడుకలను జరుపుకుందాం

-అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా వర్గాలు ఏర్పాటు

-మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరన్

ఆత్మకూరు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం




జిల్లాలో నేడు జరిగే వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకునే విధంగా భక్తాదులు, ప్రజలు పోలీస్ శాఖకు,సహకరించాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్, పేర్కొన్నారు మంగళవారం ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు పట్టణాల్లో బుధ, గురువారాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ డిఎస్పి రామాంజి నాయక్ తో కలిసి పర్యటించారు. అనంతరం ఆత్మకూరు డిఎస్పి కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను, నిమజ్జనం ఘాట్లు, శోభాయాత్ర వెళ్లే రహదారులు పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. గత సంవత్సరం వెలుగోడు పట్టణంలో ఓ మందిరం వద్ద రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసు రెవెన్యూ సిబ్బంది వినాయకులను నిమజ్జనం చేశారు. ఈ ఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని తెలిపారు నేడు నిర్వహించే వినాయక నిమర్జనం వేడుకల్లో ప్రజలందరూ సహకరి ంచాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 16 సెప్టెంబర్ 2026

# పేదల పాలిట సీఎం సహాయనిధి ఒక వరం





**-76 మంది లబ్ధిదారులకు రూ.53 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**

**-ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందజేత**

**-శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి**

ఆత్మకూరు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోం దని, పేదల పాలిట సీఎం సహాయనిధి ఒక వరం వంటిదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శ్రీశైల నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల కు చెందిన 76 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.53 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను, మంగళవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన మహానంది మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కొలిమి మక్తుమ్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 లక్షల పార్టీ తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాట్లాడుతూ. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తోందన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా, సహాయం కోసం దరఖాస్తు చేసుకు న్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అలాగే పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల భీమా ను అందిస్తున్నట్లు తెలిపారు.పేద కుటుంబాల్లో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించి, వారికి ఆపత్కాలంలో ఆర్థిక చేయూత అందించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని, అవసరమైన సమయంలో అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రూ.53 లక్షల ఆర్థిక సాయం అందడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు నిర్వహించే వినాయక నిమజ్జన ఘాట్‌లను పరిశీలన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





**-అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా**

**-ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ అధికారులకు ఆదేశలు**

ఆత్మకూరు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

వినాయక నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావ రణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతుందని నంద్యాల జిల్లాఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ మంగళవారం ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని వెలుగోడు, ఆత్మకూరు, పాములపాడు జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే వినాయక నిమజ్జన ఘాట్‌లతో పాటు ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాలను స్వయంగా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామంజి నాయక్ ను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా



ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే పోలీసులకు ప్రజలు సహకరించి, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటించాలని తెలియజేశారు వీరి వెంట ,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అశోక్, అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు రూరల్ సీఐ, సురేష్ కుమార్ రెడ్డి, ఆత్మకూరు ఎస్ఐ, వెంకట నారాయ ణరెడ్డి, పాములపాడు ఎస్ఐ తిరుపాలు, కొత్తపల్లి ఎస్ఐ జయ శేఖర్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

**-పట్టణ ప్రజల గొంతులు తడిపేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ను ఏర్పాటు చేయాలి సిపిఎం**

ఆత్మకూరు సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

పట్టణంలో జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వేసవికాలం ముగిసి వర్షాకాలం ముగియడానికి వచ్చిన వేసవిని తలపించేలా ఎండలు ఉన్నాయి. పట్టణ ప్రజల గొంతులు తడిపేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవన్ నందు సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశం పట్టణ నాయకులు డి. రామ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏ.రణధీర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణం లో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పట్టణంలో 32 వార్డులు ఉన్నాయని సంవత్సరంలో 365 రోజులు ఐదు రూపాయలకు రెండు బిందెలు చొప్పున కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలనీ కాలనీలకు అనుగుణంగా దాదాపు 60 వేల నుంచి 70 వేల వరకు పట్టణ జనాభా ఉందని ఈ జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య లేకుండా చేసేందుకు పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని అన్నారు.



అధికారులు తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోకపోతే పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవని ముందస్తు చర్యలు తీసుకొని తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు ఏ సురేంద్ర,ఎన్ వీరన్న,సద్దాం హుస్సేన్, గుంజ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

పల్నాడు, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

భారతదేశ అభివృద్ధిలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని హౌసింగ్ పీడీ ప్రసాద్ కొనియాడారు. ఇంజనీర్స్ డే సందర్భంగా మంగళవారం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో విశ్వేశ్వ రయ్య జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భ ంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశానికి ఆయన అందించిన ఇంజనీరింగ్ సేవలను పీడీ ప్రసాద్ గుర్తుచేశారు. 1861 సెప్టెంబర్ 15న జన్మించిన విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా, పండితుడిగా, రాజనీతిజ్ఞుడిగా దేశానికి విశేష సేవలందించారని తెలిపారు.మైసూరు సంస్థానానికి 1912 నుంచి 1918 వరకు దివాన్‌గా పనిచేసిన ఆయన కృష్ణరాజసాగర్ ఆనకట్ట నిర్మాణంలో చీఫ్ ఇంజనీర్‌గా కీలక పాత్ర పోషించారని వివరించారు. హైదరాబాద్ నగరాన్ని మూసీ నది వరదల నుంచి రక్షించేందుకు కూడా ఆయన పలు ప్రణాళికలు రూపొందించారని పేర్కొన్నారు. ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 1955లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను అందుకున్నారని తెలిపారు.



ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 15ను దేశవ్యాప్తంగా ఇంజనీర్స్ డేగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా కార్యాలయ సిబ్బంది, ఈఈ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహ భవనాల వేలానికి కార్యాచరణ ప్రణాళిక



పల్నాడు,సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ భవనాల వేలానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం లింగంగుంట్లలోని రాజీవ్ స్వగృహ భవనాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు, నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేలం ప్రక్రియకు అవసరమైన అన్ని చర్యలను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం వినియోగంలో లేని భూమిని గుర్తించి, దానిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించేందుకు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆస్తులు వృథాగా ఉండకుండా వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.దభవనాల వేలం ప్రక్రియతో పాటు ప్రభుత్వ భూముల వినియోగంపై స్పష్టమైన నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులకు సూచించారు.

# దేశ నిర్మాణంలో ఇంజనీర్లదే కీలక పాత్ర




నరసరావుపేట, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం

దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతి సందర్భంగా నరసరావుపేట బరంపేటలోని శ్రీపాద కళ్యాణ మండపంలో లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, సర్వేయర్ల వెల్ఫేర్ అసోసియేషన్ 59వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఇంజినీర్లు, సర్వేయర్లకు శుభాకాంక్షలు తెలిపారు. రోడ్లు, వంతెనలు, భవనాలు, నీటి వనరులు వంటి మౌలిక వసతుల అభివృద్ధిలో ఆధునిక ఇంజినీరింగ్ పద్ధతులను విస్తృతంగా వినియోగించాలని కోరారు. పట్టణాభివృద్ధి, నిర్మాణ అనుమతులు, సర్వేలు, లేఅవుట్ల విషయంలో లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, సర్వేయర్ల సేవలు కీలకమన్నారు. సామాన్య ప్రజలు ఇల్లు నిర్మించుకునే సమయంలో అనవసర ఇబ్బందులు, అదనపు ఆర్థిక భారం లేకుండా నిబంధనల మేరకు సేవలు అందించాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉంటే వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం మంజూరు విషయంలో సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ బి.శ్రీనివాస సింగ్, అధ్యక్షుడు ఆర్.బ్రహ్మయ్య, కార్యదర్శి సీహెచ్.లక్ష్మీకాంత్, ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

పల్నాడు, సెప్టెంబర్ 15 వార్త సాక్ష్యం



2026--27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ)లను పునర్వ్యవస్థీకరించేందుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, ఏపీసీ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల ప్రకటన పత్రాలను అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని అధికారులు సూచించారు. సెప్టెంబర్ 18న ఓటర్ల జాబితాను ప్రదర్శించి, సెప్టెంబర్ 25న అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను ప్రకటించనున్నారు. సెప్టెంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నిక, 2 గంటలకు ప్రమాణ స్వీకారం, 3 గంటలకు తొలి ఎస్ఎంసీ సమావేశం నిర్వహించనున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, మెరుగైన నిర్వహణ కోసం ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఎస్ఎంసీల ఏర్పాటు కోసం ప్రోత్సహించాలని అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## ద్రవ్యోల్బణం ఎఫెక్ట్.. వడ్డీ రేట్లు పెంచేందుకు ఆర్‌బీఐ రెడీ?




ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) వడ్డీ రేట్ల పెంపు సైకిల్‌ను ప్రారంభించే అవకాశం ఉందని సిస్టమాటిక్స్ గ్రూప్ నివేదిక పేర్కొంది. అక్టోబర్ తొలి వారంలో జరిగే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో ఇందుకు సంబంధించిన తొలి సంకేతాలు కనిపించొచ్చని తెలిపింది. ప్రస్తుతం 5.25 శాతంగా ఉన్న రెపో రేటు క్రమంగా 6.5 శాతానికి చేరే అవకాశముందని అంచనా వేసింది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతానికి పెరిగింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. కొత్త సిరీస్‌లో ఇదే అత్యధిక స్థాయి. వరుసగా మూడో నెలలోనూ ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకున్న 4 శాతం మధ్యస్థ స్థాయిని దాటింది. ఆహార ద్రవ్యోల్బణం కూడా 5.95 శాతానికి చేరింది. జులైలో ఇది 5.52 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ధరల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. అక్కడ ఆహార ద్రవ్యోల్బణం 6.13 శాతంగా ఉంది. హోల్‌సేల్ ధరల ద్రవ్యోల్బణం కూడా ఆగస్టులో 9.92 శాతానికి పెరిగింది. జులైలో ఇది 9.78 శాతంగా ఉంది. కూరగాయలు, సుగంధ ద్రవ్యాల ధరలు ప్రధాన ఒత్తిడిగా మారాయని నివేదిక తెలిపింది. ఇంధనం, ఇంధన ఆధారిత ఉత్పత్తుల ధరలు, తయారీ వ్యయాలు కూడా ధరల పెరుగుదలను విస్తృతం చేస్తున్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణం ఇదే వేగంతో కొనసాగితే అక్టోబర్–నవంబర్ నాటికి ఆరు శాతాన్ని దాటొచ్చని అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావంతో ఆహార సరఫరాపై ఒత్తిడి, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు ద్రవ్యోల్బణానికి మరింత ముప్పుగా మారొచ్చని తెలిపింది.

## యూపీఐ యూజర్లకు గుడ్ న్యూస్- రూ.2000 వరకు లావాదేవీలు ఉచితం!




దేశవ్యాప్తంగా కోట్లాది మంది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.2,000 వరకు జరిపే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించరాదని స్పష్టం చేసింది. ఇదే నిబంధన రూపే ఆధారిత డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులకు కూడా వర్తిస్తుందని పేర్కొంటూ సోమవారం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007లోని సెక్షన్ 10ఏ కింద ఈ మార్పులను నోటిఫై చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం, రూ.2,000 వరకు చేసే యూపీఐ, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై బ్యాంకులు గానీ, ఇతర పేమెంట్ సంస్థలు గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకూడదు. ఈ విధానాల్లో డబ్బులు పంపే వారిపైనా, స్వీకరించే వారిపైనా ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. ఇటీవల యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించవచ్చనే ప్రచారం జరగడంతో వినియోగదారులలో ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. వ్యక్తిగత (పీ2పీ) యూపీఐ లావాదేవీలు ఎప్పటికీ ఉచితంగానే ఉంటాయని గత నెలలోనే ప్రభుత్వం హామీ ఇచ్చింది. భవిష్యత్తులో వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించినా అది కూడా నిర్ణీత పరిమితి దాటిన లావాదేవీలకు మాత్రమే, నామమాత్రంగా ఉంటుందని తెలిపింది. ఆ ఛార్జీలు కూడా డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపై ఉన్న ఛార్జీల కంటే చాలా తక్కువగా ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది.

## యూపీఐపై ఛార్జీలు విధిస్తే భారత్‌లో మళ్లీ క్యాష్ వినియోగం పెరుగుతుంది: అష్నీర్ గ్రోవర్



యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే ఆలోచనపై 'భారత్‌పే' సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూపీఐ సేవలకు రుసుము వసూలు చేస్తే అది పరోక్షంగా పన్ను విధించినట్లేనని వ్యాఖ్యానించారు. ఇప్పటికే విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వస్తే ప్రజలు, వ్యాపారులు మళ్లీ నగదు వైపు మళ్లే అవకాశం ఉందని గ్రోవర్ హెచ్చరించారు. దీనివల్ల బ్యాంకులు, వ్యాపార సంస్థలకు నగదు నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని చెప్పారు. చివరికి భారత్ మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారే పరిస్థితి రావచ్చన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఛార్జీలు విధించకూడదు. రూపే డెబిట్ కార్డు చెల్లింపులకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై, ముఖ్యంగా వ్యాపారుల చెల్లింపుల విషయంలో ఛార్జీలు విధించే అవకాశం ఉందా అన్నది నోటిఫికేషన్‌లో స్పష్టంగా లేదు. ప్రస్తుతం లావాదేవీ విలువతో సంబంధం లేకుండా యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదు. అయితే రూ.2,000 పరిమితి ఎందుకు పెట్టారన్నదే తన ప్రశ్న అని గ్రోవర్ అన్నారు. రూ.2,000 కంటే ఎక్కువ లావాదేవీలు మొత్తం లావాదేవీల్లో పరిమాణం పరంగా కేవలం 4 శాతమే అయినా.. మొత్తం విలువలో వాటి వాటా 66 శాతంగా ఉందని పేర్కొన్నారు. పెద్ద మొత్తాల యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ విధిస్తే ఆ భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపే అవకాశం ఉందని గ్రోవర్ చెప్పారు. లేదంటే ఒకేసారి రూ.12,000 చెల్లించాల్సిన చోట రూ.2,000 చొప్పున పలుమార్లు చెల్లించే పరిస్థితి రావచ్చన్నారు. అదే సమయంలో దుకాణదారులు రూ.2,000 కంటే ఎక్కువ యూపీఐ చెల్లింపులను స్వీకరించకుండా నగదు అడిగే అవకాశం ఉందని చెప్పారు. అప్పుడు నగదు అవసరం పెరుగుతుంది. మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాలు అవసరమవుతాయని తెలిపారు. యూపీఐపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని గుర్తుచేశారు. ఎన్‌పీసీఐ ప్రీ-ట్యాక్స్ మిగులు కూడా రూ.1,888 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

## పాక్ క్రికెట్ బోర్డులో భారీ ప్రక్షాళన- ఆకిబ్ జావెద్, వహాబ్ రియాజ్‌లపై వేటు!




పాకిస్థాన్ పురుషుల, మహిళల క్రికెట్ జట్లు వరుస ఓటములతో నిరాశపరుస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ బోర్డులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్షాళనలో భాగంగా సీనియర్ సెలెక్టర్ ఆకిబ్ జావెద్, మహిళల జట్టు మెంటార్ వహాబ్ రియాజ్‌లను వారి పదవుల నుంచి తప్పించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం. జాతీయ సెలక్షన్ కమిటీలో సీనియర్ సెలక్టర్‌గా ఉన్న మాజీ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ జావెద్‌ను ఈ బాధ్యతల నుంచి తప్పించనున్నారు. గత రెండేళ్లుగా పీసీబీ కీలక నిర్ణయాల్లో అతడి పాత్ర ఉంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో పాక్ 0–2తో వెనుకబడినప్పుడు, సిరీస్ మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను వెనక్కి పంపించి కోచ్‌లను మార్చడం వంటి వివాదాస్పద నిర్ణయాల వెనుక అతడిదే కీలక పాత్ర. ఇకపై లాహోర్‌లోని హై పర్ఫార్మెన్స్ సెంటర్‌లో డైరెక్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ పదవికే అతడిని పరిమితం చేయవచ్చని సమాచారం. అలాగే, గత ఏడాది నుంచి పాక్ మహిళల జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న వహాబ్ రియాజ్‌ను కూడా తప్పించాలని నిర్ణయించారు. జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల తర్వాత మహిళల జట్టు కోచింగ్ సిబ్బందితో పాటు రియాజ్‌ను కూడా బాధ్యతల నుంచి విడుదల చేయనున్నారు. మహిళల జట్టుకు విదేశీ కోచ్‌లను నియమించే అంశాన్ని కూడా పీసీబీ పరిశీలిస్తోంది. "పాకిస్థాన్ క్రికెట్‌లో వరుస ఓటములు, అనూహ్య పరిణామాలకు ముగింపు పలకాలంటే కొన్ని కఠినమైన చర్యలు అవసరమని ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఇప్పుడు గ్రహించారు. అందుకే ఈ మార్పులు అనివార్యమయ్యాయి" అని బోర్డుకు చెందిన ఓ అంతర్గత అధికారి వెల్లడించారు. ఈ నిర్ణయాలను ఖరారు చేసే ముందు నఖ్వీ తన సహాయకులు, పాలకమండలి సభ్యులతో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌ను 0–3 తేడాతో కోల్పోవడం, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇరు జట్లు ఆశించిన స్థాయిలో రాణించక పోవడంతో పీసీబీ ఈ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

## తాగి గొడవపడ్డ బౌలర్ - సీరియస్‌గా హెచ్చరించిన ఇంగ్లండ్ కోచ్



ఇంగ్లండ్ వైట్-బాల్ క్రికెట్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ తమ జట్టు పేసర్ బ్రైడన్ కార్స్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశాడు. మళ్లీ జాతీయ జట్టులోకి రావాలనుకుంటే ముందుగా తన వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని స్పష్టం చేశాడు. మైదానంలోనే కాకుండా బయట కూడా వృత్తిపరమైన ప్రమాణాలు పాటించడం తప్పనిసరి అని తేల్చిచెప్పాడు. డర్హామ్ కౌంటీ ఛాంపియన్‌షిప్ విజయాన్ని సహచరులతో కలిసి జరుపుకుంటున్న సమయంలో, డెర్బీలోని ఓ బార్ వెలుపల మద్యం తాగి గొడవ పడినట్లు వచ్చిన ఆరోపణలపై గత నెలలో కార్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తర్వాత అతడిని విడుదల చేసినప్పటికీ, ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అతడిని జట్టు ఎంపిక నుంచి తప్పించింది. ఈ విషయంపై మెకల్లమ్ మాట్లాడుతూ.. "కార్స్ ఒక అద్భుతమైన క్రికెటర్. ఇంగ్లండ్ తరఫున ఆడినప్పుడు బాగా రాణించాడు. అయితే ఇప్పుడు అతడు తన వ్యవహారాలను సరిదిద్దుకోవాల్సిన సమయం ఇది. అలా చేస్తేనే తదుపరి అవకాశాల కోసం అతడిని పరిశీలిస్తాం" అని స్పష్టం చేశాడు. ఈ నిబంధనలు జట్టులోని ప్రస్తుత ఆటగాళ్లతో పాటు రాబోయే 12-18 నెలల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాలనుకునే ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని స్పష్టం చేశాడు. "మైదానం బయట సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతే, అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేరు. అలా చేయడానికి సిద్ధంగా లేకపోతే, మీ స్థానంలోకి రావడానికి చాలా మంది ప్రతిభావంతులు సిద్ధంగా ఉన్నారు" అని మెకల్లమ్ పేర్కొన్నాడు. కాగా, ఈసీబీ బెట్టింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు 2024లో కూడా కార్స్ మూడు నెలల నిషేధాన్ని ఎదుర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## ట్రోఫీ విషయంలో ప్రత్యామ్నాయం సూచించిన బీసీసీఐ.. ఏసీసీ ఎందుకు నో చెప్పింది?




ఆసియా కప్ ట్రోఫీని అందుకోవడానికి నిరాకరించిన భారత మహిళల టీమ్ విషయంలో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. పాక్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోబోమని ఏషియా క్రికెట్ (ఏసీసీ)కి తాము ముందే చెప్పినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తాజాగా ఎన్‌డీటీవీతో చెప్పారు. పైగా ఈ వివాదానికి పరిష్కారాన్ని కూడా సూచించినట్లు తెలిపారు. నఖ్వీకి బదులుగా ఏసీసీ అధ్యక్షుడు లేదా ఉపాధ్యక్షుడితో ట్రోఫీ అందించాలని బీసీసీఐ కోరినట్లు సైకియా వెల్లడించారు. ఏసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఖలీద్ సాహబ్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగితే భారత జట్టు వేడుకకు హాజరవుతుందని తెలిపింది. అయితే ఈ ప్రతిపాదనను ఏసీసీ అంగీకరించలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. తమ సూచనను ఎందుకు తిరస్కరించారన్న దానిపై ఏసీసీ నుంచి స్పష్టమైన కారణం రాలేదని సైకియా వ్యాఖ్యలతో తెలుస్తోంది. ఏసీసీ తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో భారత జట్టు ట్రోఫీ ప్రదానోత్సవానికి హాజరుకాలేదని ఆయన చెప్పారు. మరోవైపు మహిళల ఆసియా కప్ ట్రోఫీ త్వరలో భారత్‌కు చేరుతుందని సైకియా తెలిపారు. పురుషుల ఆసియా కప్ ట్రోఫీ కూడా భారత్‌కే వస్తుందని స్పష్టం చేశారు.

వార్త సాక్ష్యం
బుధవారం 16 సెప్టెంబర్ 2026

# డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ పాత్ర ఇదే

# ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్






మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం. పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు. ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. 'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి. మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

## 'కింగ్' సినిమా అలస్యమవడం లేదు: షారుఖ్ ఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ తన రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్' ప్రాజెక్ట్ ఆలస్యమవుతోందంటూ వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో సుజయ్ ఘోష్ రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రణాళిక ప్రకారమే శరవేగంగా సాగుతోందని క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలీవుడ్ మ్యూజికల్ సింగర్ అరిజిత్ సింగ్‌తో ఉన్న కాంబినేషన్‌పై ఖాన్ సంచలన అప్‌డేట్ అందించారు. 'కింగ్' చిత్రం రీ-షెడ్యూల్ అయిందనే వార్తలలో ఎలాంటి నిజం లేదని, ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారమే లండన్, ఐరోపాలోని పలు ప్రాంతాల్లో భారీ యాక్షన్ సీన్లను చిత్రీకరిస్తున్నామని షారుఖ్ తెలిపారు. 'దిల్వాలే' (జెరువా), 'పఠాన్' (జూమే జో పఠాన్), 'జవాన్' (చాలేయా) వంటి చారిత్రాత్మక చార్ట్‌బస్టర్ల తర్వాత అరిజిత్ తో మళ్లీ ఓ అద్భుతమైన లవ్ ట్రాక్ కోసం చేతులు కలిపామని వెల్లడించారు. ఈ ట్రాక్ శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో షారూఖ్ ఖాన్ తన కుమార్తె సుహానా ఖాన్‌తో కలిసి తొలిసారి పూర్తిస్థాయిలో స్క్రీన్ షేర్ చేసుకుంటుండగా, ప్రముఖ నటుడు అభిషేక్ బచ్చన్ శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో అలరించనున్నారు.




# 'డీజే టిల్లు' దర్శకుడి కొత్త సినిమా

# ఆసక్తి రేపుతున్న 'అనుమాన పక్షి' ట్రైలర్

'డీజే టిల్లు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ మరో వినూత్న కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి'. టాలెంటెడ్ నటుడు రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ కథ మొత్తం హీరో పాత్రకున్న 'అనుమానం' అనే బలహీనత చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ప్రతి చిన్న విషయాన్ని అనుమానించే వ్యక్తిగా రాగ్ మయూర్ నటన, హావభావాలు నవ్వులు పూయిస్తున్నాయి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా, క్రైమ్ థ్రిల్లర్, డార్క్ కామెడీ అంశాలను కూడా దర్శకుడు జోడించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన కథతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. 'డీజే టిల్లు' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ ఎలాంటి వినోదాన్ని అందిస్తారోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.